ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025 5
శ్రీ సత్యసాయి





టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

విద్యార్థి సంఘాల నిరసనాగ్రహం

◆ మంత్రి నారాయణ దిష్టిబొమ్మ దహనానికి యత్నం
◆ అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య ఘటనపై ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నిరసనబాట పట్టారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై మండిపడ్డారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని, ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారాయణ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం అనంతపురంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. టవర్‌క్లాక్ వద్ద నారాయణ కళాశాల యజమాని నారాయణ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించారు. పోలీసులు వారిని బలవంతంగా అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు, విద్యార్థి సంఘం నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ నారాయణ కళాశాలలో విద్యార్థి మరణంకు కారణం ఫీజుల ఒత్తిడే అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ కళాశాలల్లో విద్యార్థుల మరణాల ఘటనలూ తరచూ జరుగుతూనే ఉన్నాయన్నారు. వందలాదిమంది విద్యార్థులు చనిపోయినప్పటికీ ఏ జిల్లాలో కూడా ఆ విద్యాసంస్థపై కేసు నమోదు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం అనంతపురంలో కూడా ఆ కళాశాలపై ఇప్పటి వరకు ఎలాంటి కేసూ నమోదు చేయలేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి మరణంపై స్పందించాలన్నారు. విద్యార్థి మరణానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నుంచి నారాయణను బర్తరఫ్ చేయాలన్నారు. కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.కోటి ఆర్థిక ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతపురంలో నారాయణ విద్యాసంస్థలకు తొత్తుగా పనిచేస్తున్న జిల్లా ఆర్‌ఐఓ వెంకటరమణను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు వీటిపై స్పందించకుంటే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతరు పరమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ఎస్‌ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పవ్వి, బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, జనసేన విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి సిద్దు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిద్దు, జిల్లా ఉపాధ్యక్షులు గిరి, సోము, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉసూరుమనిపించిన ఉలవ..!

◆ వర్షాభావంతో దిగుబడిపై ప్రభావం
◆ సగం పెట్టుబడులు కూడా రాని వైనం
◆ అప్పుల ఊబిలో ఉలవ రైతులు



ప్రజాశక్తి-కదిరి టౌన్

వరుస కరువుల నేపథ్యంలో జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాగును రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. ఇదే సమయంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. కదిరి నియోజకవర్గం రైతులు అంతర పంటలుగా చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగానే ఎక్కువ మంది ఉలవ పంట సాగు చేశారు. మొదటగా ఉలవ పంట బాగా ఏపుగా పెరిగింది. దీంతో పంట దిగుబడి బాగా వస్తుందని రైతులు భావించారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో వర్షాభావం నెలకొనడంతో దిగుబడిపై ప్రభావం పడింది. దీంతో కనీసం పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది.

సగం పెట్టుబడి కూడా రాని వైనం..!

నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన రైతు నరసింహులు ఆరు ఎకరాల్లో ఉలవ పంట సాగు చేశాడు. పంట సాగునిమిత్తం రూ.65 వేల వరకు ఖర్చు చేశాడు. ప్రయివేటు వ్యక్తుల వద్దకే అప్పు తెచ్చి పంట సాగు చేశాడు. దిగుబడి సరిగా లేకపోవడంతో పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. ఉలవలు అవుటన్ లేక, గింజలు తాలుగా ఉండడంతో కొనేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రస్తుతం పంట నూర్పుడి అనంతరం అమ్మడానికి వెళ్తే క్వింటా రూ.3వేలకు మించి వ్యాపారులు అడగడం లేదు. సాగుకు రూ.65 వేలు ఖర్చు చేస్తే కనీసం రూ.30కు మించి రాని పరిస్థితి కన్పిస్తోంది. ఈ ఏడాది ఉలవ పంట సాగు చేసిన రైతులందరిదీ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. చాలా మంది రైతులు పంటను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

ప్రభుత్వంపై ఆశలు

ఉలవ సాగు చేసి పెట్టుబడులు కూడా చేతికందకపోవడంతో రైతులు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుకు పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదు. దీంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట చేతికందక పోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పంట సాగు సమయంలో సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ అధికారులు ఉలవ రైతుల గురించి పట్టించుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని, పంటనష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



అవార్డు అందుకుంటున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం పురపాలక సంఘం కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కి ప్రభుత్వం ఉత్తమ అవార్డు ప్రకటించింది. విజయవాడలోని కళాక్షేత్రం-తుమ్మంపల్లిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎపి స్టేట్ ఎలక్షన్ కమిషనర్ వివేక్‌యాదవ్ నుంచి ఉత్తమ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. కమిషనర్‌కు కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఈ అవార్డు మా పురపాలక సంఘం అధికారులు, సిబ్బందికి అంకితమని తెలిపారు. వారి సహాయ, సహకారాల వల్లే తాను ఈ అవార్డు పొందానని హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-అగళి

మండలంలోని బిసి, ఈ-బిసి, బ్రాహ్మణ, వైశ్య, కాపు, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ యాదవేంద్ర తెలిపారు. 21-60 ఏళ్ల లోపు వారు అర్హులని, ఒక్కో యూనిట్ విలువ రూ. 2 లక్షల నుండి రూ.5 లక్షల వరకూ ఉంటుందన్నారు. మండలంలో ప్రధానమంత్రి జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు.

అంగన్వాడీ సిబ్బందిపై సిడిపిఒ విచారణ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని పి.కొత్తపల్లి అంగన్వాడీ సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై శనివారం సిడిపిఒ రాధిక సూపర్వైజర్ నరసమ్మతో కలిసి విచారణ చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్త కవితారాణి, ఆయా నరసమ్మ కేంద్రం వద్ద బాహాబాహీకి దిగిన విషయం తెలుసుకున్న సిడిపిఒ ఇద్దరికీ మెమోలు జారీ చేసి మూడు రోజుల్లోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కాగా ఆయా నరసమ్మ ఆరోగ్యంపై గ్రామస్తులు సిడిపిఒకి ఫిర్యాదు చేశారు. స్పందించిన సిడిపిఒ వైద్య పరీక్షలు చేయించుకుని సోమవారం నివేదిక సమర్పించాలని, అందులో రోగ నిర్ధారణ అయితే ఆయాను సెలవులో పంపిస్తామని ప్రజలకు తెలిపారు.

నేడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని ఏఆర్ రొప్పం గ్రామంలో ఏర్పాటు చేసిన తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు వడ్డెర సంఘం నాయకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వడ్డెర సామాజికవర్గం ప్రజలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని వడ్డెర సంఘం నాయకులు, మున్సిపల్ కాంట్రాక్టర్ ఎపి బాబన్న, రామచంద్ర, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్ వడ్డే రఘురాం, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ వడ్డే నాగరాజు పిలుపునిచ్చారు.

రోడ్డు నిబంధనలు పాటిద్దాం : ఎంవిఐ

ప్రజాశక్తి-హిందూపురం

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించవచ్చని ఎంవిఐ జయశ్రీ తెలిపారు. 36వ వార్షిక జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణ శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి సూచనల మేరకు ఎంవిఐ జయశ్రీ శనివారం రూరల్ మండలం కిరికెర ఎల్ఆర్‌జి విద్యాలయలో పాఠశాల బస్సులను నడిపే డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల బస్సులకు అనుభవం కలిగిన డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో సంజీవ రెడ్డి, ఎంవిఐ రవీంద్రనాథ్ రెడ్డి, హెచ్‌సి చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కలిస్తున్న ఎంవిఐ జయశ్రీ

ఓటు వజ్రాయుధం లాంటిది : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రభుత్వాన్ని మార్చే, స్థాపించే శక్తి ఓటుకి ఉందని ఆర్‌డిఒ మహేష్ తెలిపారు. పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం 15వ జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, తద్వారా దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటర్ కార్డు పొందాలన్నారు. ఓటర్ కార్డు ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలు శివకుమారి, ఇంద్రజ, వాణిలకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక వివేకానంద, శ్రీనివాస, సత్యకృప, శ్రీసాయి డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ సిటిజన్లు నరసమ్మ, రామలక్ష్మమ్మ, పుల్లన్న, దివ్యాంగులు మల్లికార్జున, పార్వతమ్మ, ఊర్మిళను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నూతన యువ ఓటర్లకు ఓటర్ కార్డ్‌లు అందజేశారు. పట్టణంలో ప్ల కార్డులు చేతపట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. వివేకానంద, శ్రీసాయి, సత్యకృప డిగ్రీ కళాశాలకు షీల్డ్‌లతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. వ్యాఖ్యాత హిందీ టీచర్ వేణుగోపాల్ ప్రసంగం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి తహశీల్దార్లు నటరాజ్, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, స్వర్ణలత, ఎలక్షన్ డిటి ఈశ్వరయ్య, సీనియర్ అకౌంటెంట్ రాఘవరెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో మహేష్

విమానాశ్రయంలో మెరుగైన భద్రత కల్పిద్దాం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సత్యసాయి విమానాశ్రయంలో మెరుగైన భద్రత కల్పిద్దామని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. శనివారం విమానాశ్రయం ఎయిర్‌పోర్టు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ ఛైర్మన్ హోదాలో కలెక్టర్ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ విమానాశ్రయంలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఏఏ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఇందుకు ప్రభుత్వ అధికారులు, విమానాశ్రయం నిర్వాహకుల మధ్య పరస్పర సహకారం ఉండాలన్నారు. అనంతరం విమానాశ్రయం సిబ్బంది ఏర్పాటు చేసిన పవర్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డైరెక్టర్ వీరరాఘవ గ్రూప్ కమాండ్, విమానాశ్రయం కెప్టెన్ కెకెవి.యసస్, ఆడ్మిన్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ నీలకంఠారెడ్డి, కమిషనర్ ప్రహల్లాద పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

భారత రాజ్యాంగాన్ని కాపాడుదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెవివి నాయకులు డా॥ఆదిశేషు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

'భారత రాజ్యాంగాన్ని కాపాడుదాం-సమానతలు లేని భారతదేశాన్ని నిర్మిద్దాం' అని ఎస్ఎఫ్ఐ, జన విజ్ఞాన వేదిక నాయకులు పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం ఎస్ఎఫ్ఐ, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగ ప్రవేశికను చదివి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాదులు అతావుల్లా, జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు, ప్రిన్సిపల్ మల్లికార్జున హాజరై మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, ఆదేశిక హక్కులు కల్పించిందన్నారు. అయితే కేంద్రంలోని బిజెపి ప్రభు త్వం ఇటీవల అనేక చట్టాలను సవరణ చేయడం ద్వారా భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచింద న్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, నాయకులు ఏకాంత్, హరి, శామీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం

పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డా. బి.గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డా. కె.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహిం చారు. ప్రిన్సిపల్ జాతీయ ఓటర్ల దినోత్సవం, ఓటు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డా. ఎస్.చిట్టెమ్మ, డా. ఎఎస్.షమీవుల్లా, డా. బి.త్రివేణి, ఎ.కిరణ్‌కుమార్, ఎస్.పావని, ఎం.భువనేశ్వరి, ఎం.పుష్పావతి, ఎం.సరస్వతి, బి.ఆనంద్, మీనా, ధనుంజయులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండలో ఉద్రిక్తత.!

ప్రజాశక్తి- పెనుకొండ

పెనుకొండ పట్టణంలో శనివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. శివమాలధారునిపై ఓ వ్యక్తి దాడికి పాల్పడడంతో వివాదం మొదలైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పెనుకొండ పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాసులు శివమాల వేసుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో ఆటో రోడ్డుపై ఉందని పక్కకు తొలగించుమని దాదు ఆటో డ్రైవర్‌కు చెప్పారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాదు శివమాల వేసుకున్న శ్రీనివాసులుపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిని నిరసిస్తూ శ్రీనివాసులకు మద్దతుగా పలువురు దర్గా సర్కిల్లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆ ప్రాంతానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. అయినా వారు వినలేదు. దాదాపు 3 గంటల పాటు రోడ్డుపై బైఠాయించారు. అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పెనుకొండ ఆర్‌డిఒ ఆనంద్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. చివరకు దాదును అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించడంతో ఆందోళన విరమించారు.

పరిపాలన న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



పరిపాలన న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలన న్యాయమూర్తి కె.శ్రీనివాస్ రెడ్డిని బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం కలిశారు. న్యాయమూర్తులతో సమీక్ష సమావేశానికి హాజరైన పరిపాలన న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డిని అతిథి గహంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సిద్దు, శ్రీనివాస్ రెడ్డి కలిశారు. గతంలో న్యాయస్థానాలు నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక న్యాయమూర్తి, రెండవ తరగతి న్యాయమూర్తి న్యాయస్థానాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని మార్పు చేసేందుకు తీసుకున్న చర్యల్లో పరిపాల న్యాయమూర్తి ప్రముఖ పాత్ర పోషించారని న్యాయవాదులు పేర్కొన్నారు. ప్రస్తుతం పశుసంవర్ధక శాఖకు సంబంధించిన భవన సముదాయంలో రెండు, మూడవ అంతస్తుల్లో న్యాయస్థానాల నిర్వహణకు అటు సంబంధిత అధికారులను ఇటు ప్రభుత్వాన్ని ఒప్పించి న్యాయస్థానాల నిర్వహణకు అనుమతి తీసుకురావడంలో పరిపాలన న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డి చేసిన కషి పట్ల న్యాయవాదులు కతజ్ఞతలు తెలిపారు.

శ్రీజ్ఞానసాయి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

పంజాబ్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన 15వ జాతీయ డాన్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో స్థానిక శ్రీజ్ఞానసాయి విద్యానికేతన్ విద్యార్థులు సత్తాచాటారు. ఎపి డాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ద్వారా రాష్ట్రస్థాయిలో ఎంపికైన 15 మంది విద్యార్థులను జాతీయస్థాయికి పంపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో వివిధ కేటగిరీల్లో 8 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారని అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సురేందర్‌రెడ్డి, ప్రెసిడెంట్ డా. మురళీకృష్ణ తెలిపారు. జిల్లా నుంచి శ్రీజ్ఞానసాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శివసుబ్రహ్మణ్యం, బద్రీనాథ్ పాల్గొని ప్రతిభ చాటారని ఎపి డాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ కోచ్ డా. మనోహర్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను స్కూల్ కరెస్పాండెంట్ కె. క్రిష్ణమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

తంబాపురంలో ప్రభుత్వ మందులు కాల్చివేత

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని తంబాపురం గ్రామ విలేజ్ క్లినిక్ పరిధిలో శనివారం ప్రభుత్వం సరఫరా చేసిన మందులు, సిరప్‌లను కాల్చివేయడం చర్చనీయాంశమైంది. తంబాపురం విలేజ్ క్లినిక్ పరిధిలో తంబాపురం, జ్వాలాపురం, సంగాలవరదాపురం, విశ్వనాథపురం గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు చిన్న జబ్బుబారిన పడినా చికిత్స కోసం ఈ విలేజ్ క్లినిక్‌కు వస్తుంటారు. అయితే ఇందులో రోగులకు కింది స్థాయి సిబ్బంది సక్రమంగా మందులు ఇస్తున్నారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ వైద్యాధికారిణి వివరణ

ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలు, సబ్ సెంటర్లు, విలేజ్ క్లినిక్‌లకు సరఫరా చేస్తున్న మందులను రోగులకు పంపిణీ చేసిన తర్వాత ఉపయోగం లేనివి, కాలంచెల్లిన మందులను మాత్రమే ఆశా వర్కర్లు కాల్చివేశారని బత్తలపల్లి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ తేజశ్రీ తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసిన మందులను ప్రజలకు సక్రమంగానే పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

మానసిక దృఢత్వం అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ధాత్రి

హిందూపురం : మానసిక దృఢత్వాన్ని విద్యార్థినులు కలిగి ఉండాలని బెంగళూరు జైన్ యూనివర్సిటీ సీనియర్ విద్యార్థిని, కౌన్సిలింగ్ వక్త వి.ధాత్రి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే ప్రధాన ఆయుధమన్నారు. ఓటుతో మంచి నాయకున్ని ఎన్నుకుని దేశాభివద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి కోఆర్డినేటర్ డా॥శ్రీలక్ష్మి, అధ్యాపకులు డా॥యశోద, డా॥సరస్వతి, డా॥రవి నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రంగనాయకులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ అమరేష్, కళాశాల సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆర్‌డిఒ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలో అవగాహన ర్యాలీ, మానవ హారంగా ఏర్పడ్డారు. ఆర్‌డిఒ ఓటరు దినోత్సవం, ఓటు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులను సన్మానించారు. 18 ఏళ్లు పూర్తయి ఓటరుగా నమోదు చేసుకున్న వారికీ నూతన ఓటరు కార్డులు పంపిణీ చేశారు. వ్యాసరచన పోటీల విజేత విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ శ్రీధర్, ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి ఓటు హక్కు పట్ల అవగాహన కలిగి ఉండాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేశవరావు సూచించారు. రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జయప్ప, యశోధరాణి, పిఎల్ కాంతారావు, కె.ప్రతాప్, సంజీవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని రావులచెరువు గ్రామంలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనం గా నిర్వహించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు వెల్ఫేర్ అసిస్టెంట్ అంకే శ్రీధర్, విఆర్ఒ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు దినోత్సవం, ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయం సిబ్బంది, ప్రజల చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన పోటీల విజేతలకు ఎలక్షన్ కమిషన్ తరపున ప్రశంసాపత్రాలు అందజేశారు.

బుక్కపట్నం : ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రతి ఒక్కరూ ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ షాబుద్దీన్ సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి స్థానిక తేరు కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఓటు అమ్మ వద్దు, కొనవద్దు అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులు, ఎంపిడిఒ నటరాజు సూచించారు. బిఎల్‌ఒలు, సచివాలయ ఉద్యోగులు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో ఓటు ఎంతో విలువైందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్ కుమార్, వీఆర్వోలు భార్గవ్, ఉష, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.


పెనుకొండలో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నంబులపూలకుంట : ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహశీల్దార్ దేవేంద్రనాయక్ సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి రెవెన్యూ అధికారులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారిపై మనవ హారంగా ఏర్పడ్డారు. తహశీల్దార్ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణానాయక్, రమణ, పిడి సందీప్, వీఆర్వోలు రఘు, దీపిక, అనూష, సర్వేయర్ ఉపేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.


ధర్మవరం : రావులచెరువులో విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

మడకశిర : పట్టణంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారిపై విద్యార్థులతో కలిసి అధికారులు మానవహారం ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఓ గౌరీశంకర్, తహశీల్దార్ కరుణాకర్, నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి, డిప్యూటీ తహశీల్దార్లు లక్ష్మీనరసింహం, ఎన్నికల సీనియర్ సహాయకులు రామచంద్ర, కార్యాలయ సిబ్బంది, బిఎల్‌ఒలు పాల్గొన్నారు. అలాగే రొళ్లలో తహశీల్దార్ ఎస్.షెక్షావలి ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి అధికారులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎలెక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ నరసేగౌడ, ఈఓఆర్‌డి బాబురావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లేడుగుంట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.భూతన్న, వైబి.హల్లి సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్ వికాస్, విఆర్‌ఎ శశికళ ఆధ్వర్యంలో పాఠశాలలో ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, కరియణ్ణ, ఇందిరమ్మ, లలితమ్మ, రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి.బాబురావు ఆధ్వర్యంలో వృద్ధ, వికలాంగ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిద్ధారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, ఆర్ఐ అశోకచక్రవర్తి, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, గంగాధర్, విఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొత్తచెరువులో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సోమందేపల్లి : మండలంలోని రంగేపల్లిలో సర్పంచి నరసింహులు, మాజీ జడ్పిటిసి వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బిఎల్ఒ గిరిధర్, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులు, డీలర్ తిమ్మయ్య, మూర్తి, చిన్ననరసింహులు, అంజనప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ హసీనాసుల్తాన్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో మనోహారం ఏర్పాటు చేసి, ఓటరు దినోత్సవంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఇఒ శేషాచలం, హెచ్‌ఎం కృపాసత్యరాజు, డిప్యూటీ తహశీల్దార్లు హనుమంతు, శోభ, ఆర్ఐ సిద్ధేశ్వర్, ఉపాధ్యాయులు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

హిందూపురం :ఓటు హక్కు ప్రజల చేతుల్లో వజ్రాయుధం లాంటిదని వివిధ శాఖల అధికారులు పేర్కొన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెవెన్యూ శాఖ శనివారం హిందూపురం పట్టణంలో ర్యాలీ, మానవహారం కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ వెంకటేశు, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో వివిధ శాఖ అధికారులతో పాటు బాలాజీ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అంబేద్కర్ సర్కిల్ లో మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి, సెరికల్చర్ ఏడీ సురేష్ ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అమరేంద్రతో పాటు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

చదువు 'కొనలేం'..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంతపురం జిల్లా అనగానే కరువు.. రైతు ఆత్మహత్యలు గుర్తుకు వస్తాయి. పంటలు పండక వాటి కోసం అప్పులు చేసి తీర్చే మార్గం లేక అన్నదాతల బలవన్మరణాలు జరుగుతూ వచ్చాయి. ఇవి ఇప్పటికీ కొనసాగుతున్నప్పటికీ ఇటీవలి కాలంలో తమలాంటి బతుకులు తమ పిల్లలకు వద్దని.. చదివించి ప్రయోజకులను చేయాలని రైతులు భావిస్తున్నారు. అందుకోసం మంచి కళాశాలలో చేరిస్తే తమ పిల్లల భవిష్యత్ మారుతుందని ఆశలు పెట్టుకుని చేరుస్తున్నారు. కాని ఆ కళాశాలల్లో చదువుతున్న సమయంలో అసలు కష్టాలు వారికి కన్పిస్తున్నాయి. సాగు కష్టాలు పోయి.. చదువు కష్టాలు వారిని వెంటాడుతున్నాయి. పిల్లల కోసం తెలియకుండానే చదువుల భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ మోసే క్రమంలో భారమైనా బరువును దింపుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ ప్రభావం పిల్లలపైనా పడుతోంది. ఫలితంగా పిల్లలు ఆత్మహత్యల వైపు వెళ్తున్నారు. ఇందుకు సజీవ సాక్ష్యమే మూడు రోజుల క్రితం అనంతపురంలో నారాయణ కళాశాలకు చెందిన చైతన్య అనే విద్యార్థి ఆత్మహత్య ఉదంతం. రోజు కష్టం చేసుకునే తమలాంటి బతుకు పిల్లలకు వద్దని చైతన్య తండ్రి ఆశించాడు. తన ఇద్దరు కుమారులకు మంచి విద్యను అందివ్వాలని సంకల్పించాడు. ఈ చదువుల భారం శక్తికి మించి ఉంది. పెద్ద కుమారుడు బీటెక్‌కు రూ.3.90 లక్షలు, చిన్న కుమారుడు చైతన్యకు రూ.1.70 లక్షలు ఇలా ఇద్దరినీ చదించడంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాడు. అయినా పిల్లల కోసం ఈ కొద్ది రోజులు కష్టపడి గట్టెక్కిస్తే వారి భవిష్యత్, తమ భవిష్యత్ మారుతుందని ఆశించాడు. ఈ ఇబ్బందుల నడమే చిన్నకుమారుడి ఫీజు కట్టడం కాస్త ఆలస్యమైంది. దయలేని కార్పొరేట్ కళాశాల యాజమాన్యం ఫీజు ఒత్తిడిని విద్యార్థిపై పెంచింది. తోటి విద్యార్థుల ఎదుట అవమానపరచింది. ఈ అవమాన భారాన్ని భరించలేక ఆ విద్యార్థి కళాశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థుల ఫీజుల కష్టాలను తెలిపే ఒక ఘటన మాత్రమే ఇది.. ఇంకా అనేక మంది విద్యార్థులు ఫీజుల ఒత్తిడి మధ్య నలిగిపోతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు కార్పొరేట్, ప్రయివేటు కళాశాలలను నియంత్రించే చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు. ప్రజలకు మెరుగైన భవిష్యత్ అందిస్తున్నామని పాలకులు ఒకవైపు ప్రకటనలు చేస్తున్నారు. విజన్‌ల మీద విజన్‌లు విడుదల చేస్తున్నారు. అయితే సామాన్యుడికి ఉత్తమ విద్యను అందించే చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నాయి. ఇది చాలన్నదట్టు నూతన విద్య విధానం అని ఒకదాన్ని తీసుకొచ్చి మరింత ప్రయివేటుపరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజల సంపాదనలో అత్యధికం విద్యకు, వైద్యానికే ఖర్చు పెడుతున్నారని అనేక నివేదికలు చెబుతున్నాయి. వీటి భారాన్ని తగ్గించే చర్యలేవి ప్రభుత్వం తీసుకోకపోగా మరింత భారాలను మోపే విధంగా నిర్ణయాలు ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం విద్యా, వైద్యం ఖర్చులను తగ్గించే చర్యలు తీసుకోవాలని సామాన్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వాహనదారులు విధిగా నియమ నిబంధనలు పాటించి ప్రమాదరహిత ప్రయాణం చేయాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ సూచించారు. జాతీయ రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా శనివారం డీఎస్పీ ఆధ్వర్యంలో పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్యం మత్తులో, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాద న్నారు. మైనర్ పిల్లలు వాహనం నడిపితే తల్లిదండ్రులకు జరిమానా విధించడంతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీటు ధరించి వాహనం నడపాలని తెలిపారు. ర్యాలీలో సిఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, శ్రీధర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


ధర్మవరంలో ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ హేమంత్‌కుమార్

బత్తలపల్లి : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. ముందుగా పోలీస్ స్టేషన్ నుంచి తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు మీదుగా పురవీధుల్లో హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎస్ఐ సోమశేఖర్, ఎంపిడిఒ నరసింహనాయుడు హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం నగరంలో విద్యార్థి మతికి కారణమైన నారాయణ జూనియర్ కళాశాలను సీజ్ చేసి, యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. విద్యాసంస్థ వైఖరిని నిరసిస్తూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ నారాయణ కళాశాల ఫీజుల వేధింపుల తాళలేక విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం అన్నారు. విద్యార్థికి మరణానికి కారకులైన నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై ఫీజులు ఒత్తిడి చేసి ప్రాణాలను బలిగొంటున్న ఇలాంటి విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, చంద్రశేఖర్, మంజునాథ్, మూర్తి, నగేష్, బాలాజీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

సామాజిక ఉద్యమ నాయకుడు నిస్సార్ ఆత్మహత్య

ప్రజాశక్తి-అనంతపురం

సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉండే నిస్సార్ అహ్మద్ (50) శనివారం నాడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల, పోలీసుల సమాచారం మేరకు నగరంలోని యర్రనేల కొట్టాల్లో నివాసముండే నిస్సార్ అహమ్మద్ మూడు దశాబ్ధాలుగా సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉండేవాడు. అలాంటి వ్యక్తి శనివారం నాడు అనంతపురం నగరంలోని రాజధాని లాడ్జీలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరోగ్య కారణాలతో తాను చనిపోతున్నట్లు రాసిన సూసైడ్ నోట్ ఆయన వద్ద పోలీసులకు లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. టుటౌన్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరీష్‌బాబు

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

'సంవిధాన్ గౌరవ్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం మంత్రి సత్యకుమార్ కార్యా లయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు పట్టణంలోని 5వ వార్డులో డా. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగం రూపకల్పన, సమాజంలో సమానత్వం నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబిలేసు, శ్యామ్‌రావు, జింకా రామాంజనేయులు, వడిత్యా సోమ్లానాయక్, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, గోవిందకుమార్, చెన్న నారాయణమ్మ, భాను, నాగమణి పాల్గొన్నారు.

ముదిగుబ్బ : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బిజెపి మండల కన్వీనర్ బసిరెడ్డి అంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సోమల ప్రకాష్‌నాయుడు, గంగాధర్ రెడ్డి, దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్, ప్రసాద్, ఫణీంద్ర, ఇందుకూరు బాబు, రాము, చంద్ర, నాగేంద్ర, వీరాంజనేయులు, భాస్కర్ నాయక్, సాయి, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గొర్రెల సహకార సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని పోతుకుంట గ్రామ పంచాయతీలో శనివారం జరిగిన గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సంఘం అధ్యక్షునిగా గవ్వల రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా చిట్రా నారాయణస్వామి, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టిడిపి మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న తెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఎన్నిక నేపథ్యంలో గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.


ఎన్నికైన పోతుకుంట గొర్రెల సహకార సంఘం సభ్యులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో నివేదిత

'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-రొద్దం

సచివాలయం-3లో శనివారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో నివేదిత మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటను ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులను కలిసి తెగుళ్ల నివారణకు సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ భూషణ, రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పాడి రైతులకు లాభం : డిడి

ప్రజాశక్తి-మడకశిర

ప్రభుత్వం ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాలు పాడి రైతులకు ఎంతో లాభదాయకమని పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్య తెలిపారు. మండలంలోని కె.గుండుమల గ్రామపంచాయతీ ఈ.గొల్లహట్టి గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పెంచల య్య, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అమర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. పాడి రైతులకు పలు సూచనలు చేశారు. శిబిరంలో మాజీ సర్పంచి చంద్రప్ప, వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.


బత్తలపల్లిలో గొర్రెలకు నట్టల నివారణ టీకా వేస్తున్న ఎడి శ్రీనివాసులు

బత్తలపల్లి : నట్టల నివారణ టీకా వేయడం ద్వారా జీవాల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఎడి శ్రీనివాసులు తెలిపారు. బత్తలపల్లిలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఎడి మాట్లాడుతూ డీవార్మింగ్ చేయడం వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉండి రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. శరీర బరువు పెరిగి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందు తారన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలు జన్మిస్తాయన్నారు. శిబిరంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్‌నాయక్, మారుతి, శ్రీనివాసులు, సాయినందిని, పశువైద్య సహాయకులు, గోపాలమిత్రలు, పాడిరైతులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు, వేయి గొంతులు'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మడకశిర

ఫిబ్రవరి 7వ తేదీ నిర్వహించతలపెట్టిన 'లక్ష డప్పులు, వేయి గొంతులు' కార్యక్రమానికి మడకశిర తాలూకా నుంచి మాదిగ ఉద్యోగులు, మేధావులు, ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని తాలూకా అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఉగ్రనరసింహ శనివారం పిలుపునిచ్చారు. జరిగింది. కార్యక్రమంలో ఎంఇఎఫ్ మడకశిర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

హోమియో వైద్యుడిగా లక్ష్మీనరసయ్య

ప్రజాశక్తి-తలుపుల



ప్రభుత్వ హోమియోపతి వైద్యులుగా శనివారం డాక్టర్ లక్ష్మీనరసయ్య బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు హోమియో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనకు స్థానిక పిహెచ్‌సి వైద్యులు ఆశ్రితాలు సాదరంగా స్వాగతం పలికారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి రికార్డులు, టీకాల శీతలీకరణ, విధుల హాజరు పట్టికలను పరిశీలించారు. డాక్టర్ ఓంకార్‌ను అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. గ్రామంలో అర్హులైన పిల్లలు, గర్భిణులకు సకాలంలో వ్యాక్సిన్ వేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, విధి నిర్వహణలో అప్రమత్తం గా ఉండాలన్నారు. టీకాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, రవీంద్ర, రత్నమ్మ, ప్రభాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


పిహెచ్‌సిని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి

కంప్యూటర్ల వితరణ

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు పట్టణానికి చెందిన పి.వేణు గోపాల్ 3 కంప్యూటర్లను కళాశాల ఛైర్మన్ బండి వేణు గోపాల్, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. దాత పి.వేణుగోపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఈ కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని, సద్వినియోగం చేసుకొని కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు.

పరిటాల రవి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మాజీ మంత్రి పరిటాల రవీంద్ర స్ఫూర్తితో మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ తెలిపారు. ముదిగుబ్బలో శనివారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భం గా వడ్డిపేట పాఠశాలలో రేకుల షెడ్డు ఏర్పాటు చేశామని, పాతఊరిలో సప్తమాంకాలు నాటకం ప్రదర్శించామని, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయనతో పాటు నాయకులు వేలూరి జయచంద్ర, డిష్ రామంజి, నరసింహులు, సురేంద్ర, నంద, అబ్దుల్లా, నరసింహ ఉన్నారు.

కొత్తచెరువులో హోటల్ ప్రారంభం

కొత్తచెరువు : స్థానిక ధర్మవరం రోడ్డులో నాయుడు నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్‌ను శనివారం టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షులు శేఖర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, రుచి కరమైన భోజనం అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, పవన్, రాజు, రాధమ్మ, శివప్రసాద్, హరికృష్ణ, జ్యోతి, ప్రసాద్, కళ్యాణ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా సాగు చేసిన కంది పంటలో దిగుబడి అంచనా కోసం పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. మండలంలోని ఈదులముష్టూరు గ్రామంలో రైతు వెంకటరత్నం సాగు చేసిన కంది పంటలో శనివారం ఏవో ఓబిరెడ్డి, ఎఎస్ఒ లక్ష్మీనరసింహశర్మ పర్యవేక్షణలో విహెచ్‌ఎ సత్యనారాయణ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఇఒ శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్లు మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పరమపిత శ్రీవెంకటరమణాచార్య గురువు ఛారిటబుల్ ట్రస్ట్ 13వ వార్షికో త్సవం సందర్భంగా శనివారం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీయోగిముక్తేశ్వరి మాతాజీ, శ్రీమోక్షి ముక్తేశ్వరి మాతాజీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు ట్రస్ట్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ ఛైర్మన్ అశోక్‌కుమార్, కార్యదర్శి రామాంజనేయాచారి, ఉప కార్యదర్శి మల్లికార్జున, ట్రెజరర్ నాగభూషణ, శిష్య బృందం, బిజెపి నాయకులు శ్యామ్‌రావు, డోలా రాజారెడ్డి, బిల్లే శ్రీనివాస్, క్రిష్ణాపురం షాహిన్న, జె.వెంకటేష్ పాల్గొన్నారు.



ఆసుపత్రిలో ట్రస్టు సభ్యులతో హరీష్‌బాబు

దోబీఘాట్ ఏర్పాటు చేయాలని వినతి

మండలంలోని గొట్లూరు గ్రామంలో దోబీఘాట్ ఏర్పాటు చేయాలని కోరుతూ రజక సంఘం నాయకులు శనివారం మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబుకు విన్నవించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 70 కుటుంబాలు కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, సరైన దోబీఘాట్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణమే దోబీఘాట్ మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో గొట్లూరు చంద్ర, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలోని తలమర్ల గ్రామానికి చెందిన కవి, రచయిత, గొప్ప సాహితీవేత్త అయిన కళానిధి (కొల్లప్ప) విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి మారుతిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మారుతిరెడ్డి మాట్లాడుతూ కళానిధి దళిత కుటుంబంలో పుట్టి ఉన్నతవిద్య చదివాడన్నారు. బ్రిటీషు కాలంలోనే గ్రామంలో ఎయిడెడ్ పాఠశాలను స్థాపించి ఎందరినో విద్యావంతులను చేయడానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. నేటి యువతకు స్ఫూర్తినిచ్చేందుకు తలమర్ల ప్రధాన కూడలిలో కళానిధి విగ్రహ ఏర్పాటుకు పంచాయతీ స్థలం కేటాయించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో రిటైర్డ్ హెచ్‌ఎం సుబ్బరాయుడు, గోపాల్‌రెడ్డి, నాగేంద్ర, చిన్నయ్య ఉన్నారు.


పంచాయతీ కార్యదర్శికి వినతి ఇస్తున్న నాయకులు


చికిత్సపొందుతూ టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని పోట్లమర్రి గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పోట్లమర్రి గ్రామానికి చెందిన కురుబ రామకృష్ణ(55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శుక్రవారం ద్విచక్ర వాహనంపై బత్తలపల్లికి వచ్చి సాయంత్రం స్వగ్రామం తిరిగి వెళ్తుండగా గ్రామ సమీపంలోని శ్మశానవాటిక వద్ద కుక్కలు దూరడంతో వాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆర్‌డిటి ఆసుపత్రికి తీసుకురాగా ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామకృష్ణ అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతడికి భార్య శివమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిటాల శ్రీరామ్, నాయకులు సంతాపం

టిడిపి కార్యకర్త కురుబ రామకృష్ణ మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, ఎపి అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్ కుమార్, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, బిజెపి నాయకులు ఆకులేటి వీరనారప్ప, ఆకులేటి భాస్కర్ తదితరులు వారింటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భార్య శివమ్మ, కుమార్తెలు, కుటుంబ సభ్యులను పరామర్శించారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్, నాయకులు